## క్లుప్తంగా

### 16 నుంచి రెవెన్యూ సదస్సులు

దాచేపల్లి : ఈ నెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వైవీ కుటుంబరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న తంగెడ, 19న ముత్యాలంపాడు, 22 భట్రుపాలెం, 27 మాదినపాడు, 29 రామాపురం, 31 పొందుగుల, సెప్టెంబర్ 2న గామాలపాడు, 3 నడికుడి, 5 దాచేపల్లి, 6 అలుగుమల్లెపాడు, 9 కేసానుపల్లి, 11వ తేదీన పెదగార్లపాడులో ఈ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. రెవెన్యూశాఖ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత రైతులు ఈ సదస్సులో పరిష్కరించుకోవచ్చునని చెప్పారు.

### పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి



దాచేపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో గబ్రూనాయక్ అన్నారు. సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు శిక్షణలో భాగంగా మంగళవారం మండలంలోని పొందుగల, శ్రీనగర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. తడి, పొడి చెత్త కేంద్రాన్ని పరిశీలించి చెత్త సేకరణ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో గబ్రూనాయక్ మాట్లాడుతూ.. సంపద తయారీ కేంద్రాల నుంచి ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని, ఈ కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయంతో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల జాను, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, ఎంపీడీవో సాంబశివరావు, ఈవోపీఆర్డీ నాగెండ్ల రత్నం, సర్పంచ్‌లు షేక్ ఇమామ్‌వలి, కర్పూరపు వెంకటకోటయ్య, కూనం నాగిరెడ్డి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

### బాలబాట ఉత్తమ బాల అవార్డుకు ఎంపికైన సమీర



దుర్గి: మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన కార్ప్ సంస్థ ఉత్తమ బాలబాట బాల అవార్డుకు కుక్కమూడి సమీర ఎంపికయ్యారు. మూడు సంవత్సరాల నుంచి బాలబాట డీవోగా పనిచేస్తూ చదువు పట్ల ఆసక్తి, ఉత్సాహం చూపటంతో ఈ బాలికకు అవార్డును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సమీర తన బాలబాటలో ఇప్పటి వరకు 20 మందిని గురుకుల పాఠశాలలో, నలుగురిని మోడల్ స్కూల్‌లో చేర్పటానికి కృషి చేశారన్నారు. గ్రామాలలోని పేద పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పిస్తూ విద్యకు కృషి చేయటం పట్ల అవార్డును ఆమె సొంతం చేసుకున్నారు. పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్ప్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలత, డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్, ఆర్‌జీవో ప్రసాద్, ఏసీవో ప్రసాదరావులకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

### రెవెన్యూ సదస్సులకు సిద్ధం కావాలి

**ఆర్‌డీవో రమణాకాంత్‌రెడ్డి**



దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయా విభాగాల పనితీరును మెరుగుపర్చేందుకు డివిజన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాలను గురజాల రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.రమణాకాంత్‌రెడ్డి సందర్శించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సక్రమంగా రికార్డులను నిర్వహించాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాబోయే రెవెన్యూ సదస్సులలో పకడ్బందీగా నిర్వహించి భూ వివాదాలు లేకుండా చూడాలని తహశీల్దార్ ఫణీంద్ర కుమార్‌కు సూచించారు. రెవెన్యూ యంత్రాంగం ఎప్పటికప్పుడు ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. వీఆర్‌వోలు రికార్డులను భద్రపర్చుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వీఆర్‌వోలు జీరయ్య, కోటేశ్వరరావు, సునీత, కిరణ్, పలువురు సర్వేయర్లు ఉన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు

మాచర్ల రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని 26వ వార్డుకు చెందిన జక్కా రాజేష్ కుటుంబ కలహాల నేపథ్యంలో తరచూ గొడవపడుతుండేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో వాగ్వివాదంతో మనస్థాపానికి గురై తాను ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాజేష్ ద్విచక్ర వాహనం నాగార్జున సాగర్ కుడికాలువ, లింగాపురం సమీపంలో కనిపించింది. తను కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా లేకుంటే ఎక్కడైనా ఉన్నాడా వెతుకుతున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు జరుపుతున్నా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు రూరల్ ఏఎస్ఐ రఫీ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అదుపులోకి రాని డయేరియా

- చికిత్స పొందుతూ మంగళవారం ఒకరు మృతి
- పరిస్థితిని సమీక్షించిన ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి



పీహెచ్‌సీలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ప్రబలిన డయేరియా ఇంకా అదుపులోకి రాలేదు. మంగళవారం కూడా ఇద్దరు వాంతులు విరేచనాలతో బాధపడుతూ పీహెచ్‌సీకి వచ్చారు. వారిలో ఒకరికి నెల క్రితమే స్టంట్ వేసిన కేసు కావడం, వయస్సు కూడా 60 ఏళ్లు ఉండడంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పీహెచ్‌సీలో ఉన్న ఒక వ్యక్తి చికిత్స పొందుతున్నారు. మరో ఐదు మైల్డ్ కేసులు వెలుగుచూశాయి. ఇదిలా ఉంటే 11వ తేదీన నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌కు రిఫర్ చేసిన వంకాయలపాటి సత్యం(75) అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. చికిత్స పొందుతున్న సత్యంకు యూరిన్ అవ్వకపోవడం లాంటి అదనపు కాంప్లికేషన్స్ తోడైనట్లు తెలుస్తోంది. అలాగే 8వ తేదీ 91 ఏళ్ల వృద్ధురాలు పిడుగురాళ్లలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో 65 ఏళ్ల వయస్సు వ్యక్తి కూడా మృతి చెందారు. ఆయనకు డయేరియాతో పాటు శ్వాస సంబంధిత సమస్యలు కూడా ఉండడంతో గురజాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో 8 మంది, గుంటూరు జీజీహెచ్‌లో ఒకరు, మరొకరు నరసరావుపేటలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. అనధికారికంగా ఇంకా నలుగురు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురజాల ఆర్డీవో జీవీ రమణాకాంత్‌రెడ్డి కారెంపూడి పీహెచ్‌సీని మంగళవారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నాలుగు బోరు నీటి శాంపిల్స్‌ను పరీక్షకు పంపగా సురక్షితంగా ఉన్నట్లు రిపోర్ట్ వచ్చిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ ఆర్డీవోకు తెలిపారు. వైద్య శాఖ తీసిన శాంపిల్స్ రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు మెరుగుపర్చాలని, డయేరియా బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తహసీల్దార్ బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగించాలని నిరంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.రమ్య, డాక్టర్ కె.లక్ష్మీమౌనికలను ఆర్డీవో ఆదేశించారు.



వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

## ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం

గురజాల : ప్రతి ఒక్కరు ఆడపిల్లలను రక్షించాలి... వారిని మంచి చదువులు చదవించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి అన్నారు. నగర పంచాయతీలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మంగళవారం బేటీ బచావో... బేటి పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయడం నేరమన్నారు. ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



మానవహారంగా ఏర్పడి ఆడపిల్లలను రక్షించుకుందాం అని నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

**ఆడబిడ్డలను రక్షించుకోవడం మన బాధ్యత**

రెంటచింతల: మహిళలను పూజించే మన దేశంలో ఆడబిడ్డలను రక్షించుకోవడం మనందరి బాధ్యతగా తీసుకుని వారికి అన్ని విధాల అండగా ఉండాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రెంటచింతల–2 సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మకోట జెడ్పీ హైస్కూల్‌లో మహిళాశక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భస్థ దశలోనే ఆడపిల్లలను గుర్తించి చంపుతున్నారని ఇది తీవ్రమైన నేరమన్నారు. విద్యార్థినులు మానవ హారంగా ఏర్పడి ఆడపిల్లలను రక్షించుకుందాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం**

దాచేపల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లలకు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలని చెప్పారు. ఆడపిల్లలను రక్షించి చదివించాలన్నారు. ఆదర్శ పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మీ

## సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

**పలుచోట్ల అవగాహన కల్పించిన మండల వ్యవసాయాధికారులు**

గురజాల : ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి మంగళవారం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న ఆలోచనతో 2005లో సమాచార హక్కు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారుల ఆధీనంలో ఉన్న సమాచారాన్ని పౌరులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తెలుసుకునేందుకు ఏ విధంగా దరఖాస్తు చేయాలి... అన్న వివరాలను వివరించారు. అందుకు అయ్యే ఖర్చును సంబంధిత దరఖాస్తుదారు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**రెంటచింతలలో...**

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో నున్న రైతు సేవా కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత ప్రభుత్వం 2005 అక్టోబర్ 12వ తేదీన మొట్టమొదటి సారిగా సమాచార హక్కు చట్టం తీసుకువచ్చి దేశమంతటా అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సాధారణ దరఖాస్తు రుసుం రూ.10 చెల్లించి అన్ని ప్రభుత్వ శాఖలలో వారికి అవసరమైన సమాచారాన్ని రాతపూర్వకంగా పొందే అవకాశం ప్రజలకు ఉందని వివరించారు. మండలంలోని గ్రామాలలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తున్న ఏవో సంధ్యారాణి

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

వెల్దుర్తి: గ్రామాల్లో చిన్న చిన్న ఘర్షణలు పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గుండ్లపాడు, గొట్టిపాళ్ళ గ్రామాలలో పర్యటించి మాట్లాడారు. గ్రామాల్లో అనవసరమైన గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అన్నదమ్ముల్లా కలసిమెలిసి ఉండాల్సిన గ్రామస్తులు పార్టీల పేరుతో కొట్టుకుని పోలీసు స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగవద్దన్నారు. ఘర్షణలకు పాల్పడితే కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుని కుటుంబాలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. ముఠా తగాదాల వలన కుటుంబాలు నష్టపోతాయన్నారు. బంధువులై ఉండి ఘర్షణలకు పాల్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవటం మంచి పద్ధతి కాదన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసులు సత్వరమే పరిష్కరిస్తారన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్ఐ సత్యనారాయణ

# అవయవదానం ప్రాణదానంతో సమానం

మాచర్ల : ప్రతి ఒక్కరూ అవయవదానం చేయడం వల్ల మరో వ్యక్తి జీవితంలో వెలుగు నివ్వడం జరుగుతుందని మాచర్ల అర్బన్ సీఐ ప్రభాకర్ అన్నారు. అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని మాచర్ల చెన్నకేశవ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐ ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ ఎం.నాగేశ్వరరావు, కోఆర్డినేటర్ వెలుగు వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు చెన్నకేశవరావు, తిరువీధి వెంకటనాగేశ్వరరావు, కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి టి.నరసింహారావు పాల్గొన్నారు.

**అవయవ దానంపై అవగాహన**

గురజాల : ప్రపంచ అవయవ దాన దినోత్సవం పురస్కరించుకుని నగర పంచాయతీ పరిధిలోని అవగాహన ర్యాలీ వాగ్దేవి కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాలలోని బస్టాండ్ సమీపంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్ బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రతి ఒక్కరికి అన్నదానం, నేత్రదానం గురించి అవగాహన ఉంద, కానీ అవయవదానం గురించి చాలా మందికి అవగాహన లేదన్నారు. ప్రతి ఒక్కరూ అవయవ దానం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి ఫార్మసీ కళాశాల నిర్వాహకులు బడిదెల శ్రీనివాసరావు, కోకా అనంతరామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ స్వప్న, సీతారాములు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవయవదాన నమోదు పత్రాలు చూపుతున్న సీఐ ప్రభాకర్ తదితరులు

## స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం

**మున్సిపల్ కమిషనర్ గిరికుమార్**

పిడుగురాళ్ల: స్వాతంత్య్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు నిర్వహించటం జరుగుతుందని అవుట్ సోర్సింగ్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు అందరు హాజరై స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బరావు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

**మాచర్లలో...**

మాచర్ల : స్వాతంత్య్ర దిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారన్నారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన



మాచర్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు డీఈవో వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ అయేషా సుల్తానా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యా శాఖ అధికారి కె.కాంతారావు, ప్రధానోపాధ్యాయురాలు షేక్ షకీనాలు మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ పట్ల బాల్య దశ నుంచే విద్యార్థుల్లో అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జూపల్లి గంగాధర్, విద్యార్థులు, విజేతలను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు.

### ఎమ్మార్పీఎస్ సభకు తరలివెళ్లిన నాయకులు

వెల్దుర్తి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ ర్యాలీని విజయవంతం చేసేందుకు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు వెల్దుర్తి నుంచి ఆరు వాహనాలలో తరలి వెళ్లారు. గారా మల్లయ్య, రాయనూతల సురేష్‌ల ఆధ్వర్యంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల నుంచి ఎమ్మార్పీఎస్ బలోపేతానికి పాటుపడ్డారన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు జరిగే ర్యాలీని విజయవంతం చేసేందుకు తరలివెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళూరి యాకోబు, మాచర్ల కిరణ్, గారా యోహాను, ఎ.జక్రయ్య తదితరులున్నారు.

## నర్సరీ నిర్వాహకులు లైసెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

**ఉద్యానశాఖ అధికారి మోహన్**

రెంటచింతల: ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అందించే సబ్సిడీతో నర్సరీలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులకు నర్సరీ చట్టం(2010)పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ అన్నారు. మంగళవారం ఆయన రెంటచింతల, పాలువాయి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నర్సరీలను ఆకస్మికంగా తనిఖీ చేసి నర్సరీ నిర్వాహకులకు లైసెన్స్ (రిజిస్ట్రేషన్)పై అవగాహన కల్పించి మాట్లాడారు. నర్సరీ రిజిస్ట్రేషన్ కొరకు పాటించవలసిన నియమ నిబంధనలను వివరించారు. దరఖాస్తు ఫామ్–ఎ, రూ.1000 చలానా(బ్యాంక్ వివరాలు), పట్టాదారు పాస్ పుస్తకం నకలు, లీజ్‌కాపీ కౌలు ఖరారు నమూనా, నర్సరీ నమూనా, భూసార పరీక్షల వివరాల పత్రాలు, నీటి నమూనా పత్రాలను రిజిస్ట్రేషన్ కొరకు అధికారులకు ఇవ్వాల్సి ఉందన్నారు. ఉద్యానశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాక్ రిజిస్టర్, ప్రొడక్షన్ అండ్ సేల్స్ రిజిస్టర్, నర్సరీ పర్యవేక్షణ (మెయింటెనెన్స్) రికార్డులలో మొక్కల పెంపకం, క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. మిర్చి మొక్కలను విక్రయించేటప్పుడు ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని అందులో విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్, మొక్కల సంఖ్య, ధర నమోదుచేయాల్సి ఉందన్నారు. నర్సరీల నిర్మాణ, నిర్వహణ సమయాలలో ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని తక్కువ ఖర్చుకే రైతులకు నాణ్యమైన మొక్కలను అందించవచ్చన్నారు. రెంటచింతల, పాలువాయి జంక్షన్ ప్రాంతాలలో మొత్తం 42 నర్సరీలు ఉన్నాయని దీంతో ఇది ఒక హార్టికల్చర్ హబ్‌గా రూపొందిందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ పవన్ కుమార్, నర్సరీ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



నర్సరీలో మిర్చినారును పరిశీలించి సూచనలు ఇస్తున్న గురజాల హెచ్‌వో మోహన్

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దాచేపల్లి : చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కేసానుపల్లి కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం, స్థానిక భవిత కేంద్రంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. చట్టాలపై సుదీర్ఘంగా న్యాయమూర్తి శ్రీనివాసరావు వివరించారు. క్షణికావేశంలో తప్పులు చేసి శిక్షలకు గురికావద్దని, ఎంతటి వ్యక్తులు నేరం చేసిన చట్ట ప్రకారం శిక్షను అనుభవించాల్సిందేనని ఆయన చెప్పారు. చట్టాలను ఉల్లంఘించి ఇబ్బందులు పడవద్దని హితవు పలికారు. విద్యార్థులతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కిలారి సత్యనారాయణ, ఎస్ఐ జీ సంధ్యారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు షేక్ జానీబాషా, పారాలీగల్ వలంటీర్ ముంద్ర రామారావు, లాలా అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

## గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులదే కీలక పాత్ర

మాచర్ల రూరల్: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మహా నేతలు చెప్పిన మాటలను నిజం చేయాలంటే స్థానిక ప్రజా ప్రతినిధులదే కీలక పాత్రని ఎంపీడీవో కె.సరోజనీదేవి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి సర్పంచ్, కార్యదర్శి గ్రామాభివృద్ధిపై పక్కా ప్రణాళికతో ముందుకు పోవాలని, ప్రభుత్వం అందించే ఆర్థిక సంఘ నిధులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, వీధి లైట్లు, రోడ్లు వంటి పనులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని అర్హులందరికీ అందించటంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులదే బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శులు యెల్లెబోయిన కోటేశ్వరరావు, బిట్టు వెంకటేశ్వర్లు, దస్తగిరి, బాబులాల్ నాయక్, రమణ, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, నోముల కృష్ణ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సరోజనీదేవి

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అమానుషం

పిడుగురాళ్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరపటం అమానుషమని వానరసేన, హిందూ సంఘాల నాయకులు అన్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి పట్టణ పురవీధుల్లో శాంతియుత ర్యాలీని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులు, చిన్న పిల్లలపై అమానుషంగా దాడులు చేస్తున్నారని, ఇది సరైనది కాదని అన్నారు. అనంతరం హిందువుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేసుకుంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, వానరసేన నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

దుర్గి: భారతదేశాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని, పరిశుభ్రతతోనే గ్రామాభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ యేచూరి సాయి శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండవ రోజు సర్పంచ్‌లు, సెక్రటరీల శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు వంటి కనీస సమస్యలు పరిష్కరించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలన్నారు. ప్రభుత్వం అన్ని గ్రామాలలో మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తుందని, అవగాహన లేని సర్పంచ్‌లకు ప్రభుత్వం శిక్షణ తరగతులను ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. సర్పంచ్‌లకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా, ఏవో శివప్రసాద్, రాజానగర్ సర్పంచ్ జక్కా రమేష్ నాయుడు, సర్పంచ్‌లు తదితరులున్నారు.



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ సాయి శంకర్ తదితరులు

### నీటిని ఒడిసి పట్టాలి

**టెక్నికల్ ఆఫీసర్ టి మధు**



గురజాల: నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలను (గ్రౌండ్ వాటర్) పెంపొందించుకోవచ్చని టెక్నికల్ ఆఫీసర్ టి.మధు సూచించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో నిర్వహించిన ఫారంపాండును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పని జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. జలశక్తి అభియాన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్, జి.సురేంద్ర కుమార్, ఏపీవో పద్మజ, టీఏ గోవింద నాయక్, టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, శ్యాంసుందర్, పి.ఎస్.ఆర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.